క్లుప్తంగా

పొంగి పొర్లుతున్న డ్రెయిన్లు



కాళీపట్నంలో పొంగి ప్రవహిస్తున్న ఉప్పుటేరు

మొగల్తూరు: ఐదు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఉప్పుటేర్లు, డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని యనమదుర్రు, గునుపూడి, వెస్ట్ కుక్కిలేరు, దర్బరేవు, గొంతేరు, మాగిలేరు డ్రెయిన్, కాళీపట్నంలోని ఉప్పుటేరు పొంగి పొర్లుతున్నాయి. దర్బరేవు డ్రెయిన్ పొంగి ఆయుకట్టు భూముల్లో నీరు చేరి నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నేడు లయన్స్ క్లబ్ సమావేశం

ఉండి: నూతనంగా ఏర్పడిన లయన్స్ క్లబ్ సమావేశాన్ని ఉండి కూనపరాజు అప్పలరాజు, సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు తెలిపారు. ఈ సందర్భంగా హంగర్ ప్రోగ్రాం నిర్వహణ, సభ్యులకు పిన్స్ పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు.

కర్ణాటక సైబర్ పోలీసుల విచారణ

ఆకివీడు: కర్ణాటక నుంచి సైబర్ పోలీసులు ఒక కేసు విషయమై ఆకివీడులో సోమవారం విచారణ చేపట్టారు. స్థానిక తెలగపాముల కులస్తుల ప్రాంతంలో విచారణ చేశారు. అనంతరం ఎస్ టర్నింగ్ వద్ద తెలగపాముల కులస్తుల యువతీ, యువకులను ఫోటోలు తీసుకున్నారు. విచారణ కోసం వచ్చిన పోలీసులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బి.నాగబాబు అనుమతితో విచారణ చేపట్టారు.

పేదలకు నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న దాత


ఉండి: ఆపదలో ఆదుకోవడమే మానవత్వమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు అన్నారు. ఉండిలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కాలకూరి రత్నానికి విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, రూ.3 వేలు ఆర్థిక సాయాన్ని దాత చేతుల మీదుగా అందించినట్లు సుబ్బారావు తెలిపారు. పలువురు నిరుపేదలకు కూడా నిత్యావసర వస్తువులను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం బ్రతికి ఇతరులను బ్రతికించాలని హితవు పలికారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



వరద ఉధృతి దృష్ట్యా ఇసుక మూటలు సిద్ధం చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్ : లోతట్టు ప్రాంతాలలో వరద ఉధృతి దృష్ట్యా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులు అన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ప్రభావానికి నరసాపురం ప్రాంతంలో వ్యవసాయ భూములు, పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. సోమవారం కూడా చినుకులు, ఈదుగాలులు తీరప్రాంతంలో నెలకొన్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమవ్వడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మండలంలోని ఆదివారం కురిసిన అధిక వర్షంతో పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. గోదావరి వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో అధికారులు సహాయక చర్యలు వేగవంతం చేశారు. కొత్త నవరసపురం ఎస్టీకాలనీలో ఇప్పటికే వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. వరద ఉధృతి దృష్ట్యా రెవెన్యూ సిబ్బంది నిరంతరం గస్తీ ఏర్పాటు చేశారు. అలాగే పాత నవరసపురం, లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, దర్బరేవు, తదితర ప్రాంతాల్లో కూడా గోదావరి ఏటిగట్టు నిరంతరం పర్యవేక్షించుటకు రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఫంటు ప్రయాణాన్ని నిలుపుదల చేశారు. మంగళవారం ఉదయానికి నరసాపురం ప్రాంతంలో వరద ఉధృతి మరింత పెరగొచ్చని ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ ప్రసాద్ సిబ్బందికి సూచించారు.



ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

లంక మేత.. గోదావరి మునక

- ముంపులోనే లోతట్టు ప్రాంతాలు
- నీట మునిగిన కనకాయలంక కాజ్‌వే

యలమంచిలి: గోదావరి ఎగువ భాగం నుంచి వరద నీరు పోటెత్తడంతో గోదావరి శాంతించక ఉగ్రరూపం దాల్చింది. గోదావరి లంక గ్రామాలు నీట మునగడంతో లంక మేత.. గోదావరి మునకలా తయారయ్యింది. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక చేశారు. దీంతో కనకాయలంక వద్ద కాజ్‌వేపై నుంచి నాలుగు అడుగుల వరద నీరు ప్రవహిస్తోంది. ప్రజల రాకపోకలకు వీలుగా అధికారులు పడవలు ఏర్పాటు చేశారు. కనకాయలంకలో వరద పరిస్థితిని పర్యవేక్షించేందుకు జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్ సోమవారం పర్యటించారు. వరద వలన విష సర్పాల సంచారం ఉంటుంది. ఈ నేపథ్యంలో మనుషులకు, పశువులకు ఇబ్బంది కలగకుండా కనకాయలంకలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని, అవసరమైతే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు, బాలింతలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ చెప్పారు. వీరి వెంట సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, వీఆర్వో సరెళ్ల లక్ష్మి ఉన్నారు.

డీఎంహెచ్ఓ పర్యటన

వరద ప్రభావిత గ్రామాలలో పర్యటించారు. కనకాయలంక, పెదలంక, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, లక్ష్మీపాలెం గ్రామాలలో వారు పర్యటించారు. వరద హెచ్చరికల నేపథ్యంలో వరద ప్రభావిత గ్రామాల్లో సోమవారం డీఎంహెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు పర్యటించారు. వరద నేపథ్యంలో బురద వలన కలరా, డయేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.



కనకాయలంక వద్ద కాజ్‌వే మునిగిపోవడంతో పడవలపై ప్రయాణిస్తున్న ప్రజలు



బాడవలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు

ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడి ఆహార పదార్థాలు తినాలని ఆయన కోరారు. వరద ప్రభావిత గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామని, ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట డాక్టర్ వర్ధనపు సుభాష్ చంద్ర స్వరూప్, ఎంపీహెచ్ఈఓ సత్యనారాయణ, సూపర్‌వైజర్ సరోజిని తదితరులు ఉన్నారు.

వణికించిన వరుణుడు.. మునిగిన నారుమడులు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో ఐదు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 18 నుంచి 22 వరకు సుమారు 105.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. దీంతో మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు, రామన్నపాలెంలోని అడవిపత్ర, సుబ్బారాయుడు గుడి ప్రాంతంలోని ఆకుమడులు పూర్తిగా నీటి మునిగాయి. ముందుగా నాట్లు వేసిన పొలాలు కాలువలను తలపిస్తున్నాయి. సోమవారం మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, సిబ్బంది ముంపు ప్రాంతాల్లో పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. ఆకుమడుల్లో నిలిచిన నీరు నిల్వ ఉండకుండా చూడాలని, గట్లు ఎత్తుగా ఉంటే ఇంజన్లు వేసి నీటిని బయటకు తోడాలని సూచించారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే నీటిని బయటకు తోడిన వెంటనే కార్బోడిజమ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. సార్వా సాగు ఇప్పటికే ఆలస్యమైందని, మడుల్లో నీరు నిలిచిపోయి, మరి కొద్ది రోజులు వర్షాలు పడితే వెదజల్లే పద్ధతి పాటించాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు.

లంక భూములను ముంచుతున్న గోదావరి

పెనుగొండ: రోజురోజుకూ గోదావరికి వరద నీరు పోటెత్తడంతో లంక భూముల్లో కూరగాయల తోటలు నీట మునుగుతున్నాయి. ఆచంట మండలంలోని అయోధ్య లంక, పెదమల్లం లంక, పల్లెపాలెం, రావిగుంట, మర్రిమూల, అణగారలంకల్లోని కూరగాయల తోటలు నీట మునుగుతున్నాయి. మంగళవారం నాటికి మరింత ఉధృతంగా నీటి మట్టం పెరిగే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సోమవారం ఆచంట మండల తహసీల్దారు ఐపీ శెట్టి, ఎంపీడీవో నరసింహ ప్రసాద్, ఇతర అధికారులు పడవపై అయోధ్య లంక చేరుకొని వరద పరిస్థితిని సమీక్షించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద నీరు పెరిగితే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండే విధంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. భద్రాచలం వద్ద 55 అడుగులు దాటితే గాని లంక గ్రామాలు మునిగే అవకాశం ఉండదని తగు చర్యలు తీసుకోవాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

సిద్ధాంతంలో..

పెనుగొండ మండలం సిద్ధాంతంలో గోదావరి నీటి మట్టం నెమ్మదిగా పెరుగుతుంది. కేదారీఘాట్‌లోని మెట్ల పైకి నీరు చేరుకొంది. పడవలను ఒడ్డుకు చేర్చారు. సోమవారం తహసీల్దారు రోహిణీదేవి, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ దొర, గోదావరి హెడ్ వర్క్స్ ఏఈ పవన్ కుమార్ కేదారీఘాట్‌లో వరద పరిస్థితిని పరిశీలించారు. దొంగరావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి, చినమల్లంలోని ఏటిగట్టు ప్రాంతాలను పరిశీలించారు. సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), చింతపల్లి జేమ్స్, గ్రామ కార్యదర్శి ఎస్‌వీవీ నరసింహమూర్తి ఘాట్‌లో పరిస్థితులు పర్యవేక్షిస్తున్నారు. సందర్శకుల తాకిడి పెరగడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అయోధ్య లంకకు పడవపై వెళుతున్న అధికారులు



లంక గ్రామాల్లోకి చేరుతున్న వరద నీరు



ఆకుమడులను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి రహీమ్

దుర్గాలక్ష్మణేశ్వరుడికి ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు యలమంచిలి ప్రసాదశర్మ నేతృత్వంలో అర్చనలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి, తదితరులు పాల్గొన్నారు.

కార్గో పార్సిళ్ల వేలం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆర్టీసీ కార్గో నందు ఎవరూ తీసుకువెళ్లని పార్సిల్స్‌ను మంగళవారం ఉదయం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు జిల్లా కార్గో మేనేజర్ సుబ్బారావు తెలిపారు. ఆసక్తిగల వారు ఉదయం10 గంటలకు హాజరుకావాలని కోరారు.

రైల్వే గేటు మూసివేత

పాలకోడేరు: ఈ నెల 24, 25 తేదీల్లో కుముదవల్లి రైల్వే గేటును మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే గేటు వద్ద గల రోడ్ మరమ్మతుల దృష్ట్యా మూసి వేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని తెలిపారు. కుముదవల్లి పంచాయతీకి, పాలకోడేరు తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు.

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ ఫైనాన్స్ లిమిటెడ్ పాలకొల్లు వారు ... 4942/2018 ... ఆర్.యస్.నం 45/3 లో 128-88-00 ...

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ ఫైనాన్స్ లిమిటెడ్ పాలకొల్లు వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ పేరు మీద 1). శ్రీ చేగొండి శ్రీనివాసరావు తండ్రి సత్యనారాయణ 2). చేగొండి నాగ సత్యనారాయణ తండ్రి సత్యనారాయణ ... 14 ...

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732

ప్రకటన

... 96/2018, 12వ వార్డు గునుపూడి గ్రామం ఆర్.యస్.నం 516/10 లో 242 చ.గ. ...

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732

NOTICE

నా క్లయింట్ M/s. LIC Housing Finance Ltd., Bhimavaram వారి సంజాయిషీ ప్రకారం తెలియచేయునదేమనగా : ... Regd. Relinquishment deeds dated 05-03-2010 (Doct. Nos. 1318/2010 & 14-12-2021 (Doc. No. 8444/2021 of Palakole SRO ... construction loan ... Original link document ... Regd. sale deed dt. 13-08-1990 (Doc. No. 2494/1990 of Palakole SRO) ... Shedule ... K. Srinivas ...

ఆస్తి వివరం : 1st Item : 197.70 sq.yards in Plot No. 23, LP No. 100/1989, TS No. 321/3, RS No. 74/3, Ward No.9, Palakole, W.G. District being bounded by : East : Property of J. Nagarathnam, South : 2nd Item, West : Property of Didla Chakravarthi, North : Road, 2nd Item : 52.018 sq.yards site in Plot No. 23 being bounded by : East : Property of J. Surya Satyanarayana, South : Property of Suvarna Kumari, West : Property of Chakravarthi, North : 1st Item above. (Total : 249.7 sq.yrds site and structures therein)

P.Ramakrishna Paramahamsa, Advocate.
30-10-19, Durga Agrabaram, Vijayawada-2.
AP/598/1986, Cell : 9866335633

ముంపు సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తా

పెనుమంట్ర: మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రులో వరద ముంపు ప్రాంతాలలో సోమవారం కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు పర్యటించారు. రైతులను ముంపు సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోస్తనీ ఆక్రమణల తొలగింపు పనులు సక్రమంగా జరగలేదని, నాట్లు, పంట సమయంలో ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వివరించారు. ఈ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి పులపర్తి నాగరాజు, శరకడం శ్రీనివాస్, మారుతీ కృష్ణ, కర్రి సూర్రెడ్డి, కర్రి బ్రహ్మనందరెడ్డి, కర్రి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.గంగరాజు

అన్నదాన ఫౌండేషన్ ఏర్పాటు

పెనుమంట్ర: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో శాశ్వత అన్న సమారాధన కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా రెడ్డి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, మార్టేరు-1 ఎంపీటీసీ సభ్యుడు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భవిష్యత్ తరాల వారు శాశ్వత అన్న సమారాధన నిర్వహించుకునేందుకు వీలుగా జిల్లా సంఘం ఆధ్వర్యంలో శ్రీమాల గూరమ్మరెడ్డి వన భోజన ఫౌండేషన్ పేరుతో కమిటీని ఏర్పాటు చేశామని, కమిటీకి అధ్యక్షుడిగా మేడపాటి చిరంజీవిరెడ్డి, కార్యదర్శిగా వెలగల అమ్మిరెడ్డి, కోశాధికారిగా కొవ్వూరి సత్తిరెడ్డిలను నియమించినట్లు ఆయన తెలిపారు. ఫౌండేషన్‌కు తొలి విరాళంగా సత్తిరెడ్డి రూ.2 లక్షలు అందజేయగా, వెంకటరెడ్డి, విజయ, మేడపాటి ఉదయ్, రేఖాంజలి దంపతులు రూ.2.10 లక్షలు విరాళంగా అందజేశారన్నారు.



రెడ్డి సేవా సంఘానికి రూ. 2లక్షలు విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ కొవ్వూరి సత్తిరెడ్డి

కుళాయిల నుంచి మురుగునీరు సరఫరా

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని 11వ వార్డులో గత వారం రోజుల నుంచి మంచినీటి కుళాయిల ద్వారా మురుగునీరు సరఫరా అవుతోంది. దీంతో స్థానికులు మురుగునీరు సరఫరా కావడంతో ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో తుఫాను ప్రభావంతో నిరంతరాయంగా వర్షాలు కురవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుళాయిలను పరిశీలించి మంచినీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయంపై మున్సిపల్ కమిషనర్ డి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో మురుగునీరు సరఫరా అవుతుందని ఇటీవలే తమకు సమాచారం వచ్చిందన్నారు. మురుగునీరు వస్తున్న ప్రాంతాలను పరిశీలించి మరమ్మతులు చేపట్టి మంచినీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.



కుళాయిల ద్వారా వచ్చిన మురుగునీరు

వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉన్నాం

ఆర్డీవో అచ్యుత అంబరీష్

నరసాపురం: వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, నష్టాలు జరగకుండా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్ ప్రజలకు ధైర్యం చెప్పారు. సోమవారం ఆర్డీవో నరసాపురం పట్టణం గోదావరి పరీవాహక ప్రాంతాలైన 1, 2, 3 వార్డుల్లో పర్యటించారు. పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ఏటిగట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో స్థానికులతో మాట్లాడారు. వర్షాలు తగ్గుముఖం పట్టినా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు కారణంగా వశిష్ఠ గోదావరి ఉగ్రరూపంలో ప్రవహిస్తోందని చెప్పారు. వరద పరిస్థితి మరింత ఎక్కువైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఇందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని సూచించారు. నరసాపురం, యలమంచిలి, మొగల్తూరు, ఆయంట మండలాల్లో పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు వలలు, వేట పనిముట్లు భద్రపరచుకోవాలన్నారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్న చోట్ల యుద్ధ ప్రాతిపదికన పటిష్ట పరచాలని ఆదేశించారు. ఇసుక బస్తాలు, తడికెలు సిద్ధం చేయాలన్నారు. అవుట్‌పాల్ స్లూయిస్‌ల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని కన్జర్వెన్సీ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో వెంట నరసాపురం తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఆర్ఐ కె.యశోద, తదితరులు ఉన్నారు.



ఏటిగట్టును పరిశీలిస్తున్న ఆర్డీవో అచ్యుత అంబరీష్

నక్కల అవుట్ ఫాల్ స్లూయిజ్‌కు షట్టర్ సిద్ధం

యలమంచిలి: వడ్డిలంక వద్ద గల నక్కల అవుట్ ఫాల్ స్లూయిజ్ తలుపు సోమవారం ఊడిపోయింది. ప్రస్తుతం గోదావరిలో నీటి కంటే నక్కల డ్రెయిన్ నీరు అధికంగా ఉండడంతో డ్రెయిన్‌లో నీరు గోదావరిలోకి వేగంగా వెళుతుంది. అయితే గోదావరిలో వరద పెరుగుతున్న నేపథ్యంలో నక్కల అవుట్ ఫాల్ స్లూయిజ్ తలుపు ఊడిపోవడం రైతుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తుంది. గోదావరిలో వరద ఉధృతి మరింత పెరిగితే ఆ నీరు నక్కల డ్రెయిన్‌లోకి ఎదురు వస్తుంది. అదే జరిగితే వద్దిపర్రు, గుమ్ములూరు, వల్లూరు, గుంపర్రు, బూరుగుపల్లి, కాంబొట్లపాలెం, చింతదిబ్బ, నారినమెరక, వడ్డిలంక, కట్టుపాలెం, మట్లపాలెం, గంగడుపాలెం తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు, సుమారు 8 వేల ఎకరాల వరి పొలాలు, ఆక్వా చెరువులు ముంపునకు గురయ్యే ప్రమాదముంది. నక్కల అవుట్ ఫాల్ స్లూయిజ్ తలుపు ఊడిపోయిన నేపథ్యంలో అధికారులు కాజ అవుట్ ఫాల్ స్లూయిజ్ వద్ద గల పాత షట్టర్‌ను నక్కల అవుట్ ఫాల్ స్లూయిజ్ వద్దకు తీసుకు వచ్చారు. అయితే అటు డ్రెయిన్‌లోనూ, ఇటు గోదావరిలోనూ వరద నీరు అధికంగా ఉన్న నేపథ్యంలో ఈ షట్టర్ పెట్టడం సాధ్యమా అనే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద సిద్ధం చేసిన పాత షట్టర్

బధిర పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

భీమవరం: పట్టణంలో వసుధ ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం వెంకటేశ్వర బధిరుల పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు మాట్లాడుతూ బదిర విద్యార్థులు విద్యాసామర్థ్యలు ఎక్కువగా కలిగి ఉంటారని, వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, బి వెంకటపతిరాజు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన

నరసాపురం రూరల్: నరసాపురం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఈదా అనిల్ కుమారి తన పరిధిలోని అధిక వర్షాలవల్ల పలు ప్రాంతాల్లో ముంపు బారిన పడిన నారుమడులు, పంట చేలను రైతులతో కలసి పరిశీలించారు. సోమవారం నరసాపురం మండలంలోని చినమామిడిపల్లి, లిఖితపూడి గ్రామాల్లోని ముంపు బారిన పడిన నారుమడులను పరిశీలించిన ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసాపురం మండలంలో 9613 ఎకరాలు, యలమంచిలి మండలంలో 6291 ఎకరాలు, మొగల్తూరు మండలంలో 1620 ఎకరాల్లో సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. నరసాపురం మండలంలో నాట్లు వేసిన వాటిలో 64 ఎకరాలు ముంపు బారిన పడగా దానిలో 52 ఎకరాలు నష్టపోయిందన్నారు. అలాగే నరసాపురం మండలంలో వేసిన నారుమడుల్లో 306 ఎకరాలు నీట మునగగా దానిలో 161 ఎకరాల నారుమడి నష్టపోయిందన్నారు. యలమంచిలి మండలంలో నాట్లు వేసిన 136 ఎకరాలు ముంపు బారిన పడగా 74 ఎకరాలు దెబ్బతిందన్నారు. నారుమడులు 146 ఎకరలకు నారుమడులు వేయగా 30 ఎకరాల నారుమడి దెబ్బతిన్నాదన్నారు. మొగల్తూరు మండలంలో నాట్లు వేసిన వరి చేలు 64 ఎకరాలు ముంపు బారిన పడగా, 49 ఎకరాలు ఇంకా ముంపులోనే ఉందన్నారు. ఇదే మండలంలో 30 ఎకరాల నారుమడులు వేయగా వాటిలో 15 ఎకరాల నారుముడులు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ ఏడీ అనిల్ కుమారి పేర్కొన్నారు. నరసాపురం, యలమంచిలి, మొగల్తూరు మండలాల్లో మొత్తం 264 ఎకరాలు నాట్లు ముంపు బారిన పడగా వీటిలో 175 ఎకరాలు దెబ్బతిన్నాయని, 482 ఎకరాల్లో నారుమడులు ముంపు బారిన పడగా, వాటిలో 208 ఎకరాలు పూర్తిగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే ముంపు చేలల్లో నీరు లాగిన అనంతరం ఎకరానికి 15 కిలోల యరియా, 20 కిలోల పొటాష్‌లను వినియోగించాలని సూచించారు. అలాగే కార్బన్డిజం, మ్యాన్‌కోజబ్ మందును ఎకరాకు అరకిలో చొప్పున పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.



మునిగిన వరినాట్లు, నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్
90102 23729 (ఆచంట)
90102 01609 (నరసాపురం)
95055 07552 (పాలకొల్లు)
Office mail : tpgadvt@gmail.com